# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 10-04-2024** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **21వ శతాబ్దపు భారతదేశానికి 2024 ఎన్నికలు చాలా కీలకమైనవని భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు, ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు.**
2. **వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, వైఎస్ జగన్మోహన్ రెడ్డి చేపట్టిన మేమంతా సిద్ధం బస్సు యాత్ర పల్నాడు జిల్లాలో కొనసాగుతోంది.**
3. **ఆంధ్ర ప్రదేశ్‌లో లోక్ సభ, అసెంబ్లీ ఎన్నికలకు కాంగ్రెస్ పార్టీ రెండవ జాబితా విడుదల చేసింది**
4. **చంద్రుడిపై మరిన్ని ప్రయోగాలకు చేపట్టిన 'చంద్రయాన్-4' అభివృద్ధి దశలో ఉందని ఇస్రో ఛైర్మన్ ఎస్. సోమనాథ్ వెల్లడించారు**
5. **సార్వత్రిక ఎన్నికలలో ఓటు వేసిన సందర్భంగా చేతి వేలికి సిరా వేయించుకున్న అభ్యర్థులను ప్రవేశ పరీక్షలకు అనుమతించరనే ప్రచారం అవాస్తవమని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ -స్పష్టం చేసింది**

==========================

21వ శతాబ్దపు భారతదేశానికి 2024 ఎన్నికలు చాలా కీలకమైనవని భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పేర్కొన్నారు. మధ్యప్రదేశ్‌లోని బాలాఘాట్‌లో నిన్న జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ ఇవి కేవలం ఎన్నికలే కావని, నవ భారతాన్ని నిర్మించే లక్ష్యం అని అన్నారు. బిజెపి ప్రభుత్వం సబ్‌కా సాథ్-సబ్కా వికాస్ మంత్రాన్ని అనుసరిస్తోందనీ, దేశంలోని ప్రతి నగరాన్ని, గ్రామాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. మౌలిక సదుపాయాల అభివృద్ధి గురించి ప్రస్తావిస్తూ.. దేశంలో ఆధునిక మౌలిక సదుపాయాల కోసం తమ ప్రభుత్వం కోట్లాది రూపాయలను వెచ్చిస్తోందని నరేంద్ర మోదీ పేర్కొన్నారు.

-------------------------

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, వైఎస్ జగన్మోహన్ రెడ్డి చేపట్టిన మేమంతా సిద్ధం బస్సు యాత్ర పల్నాడు జిల్లాలో కొనసాగుతోంది. యాత్రలో భాగంగా ఈ రోజు ఆయన గంటావారిపాలెం నుంచి బయలుదేరి పుట్టవారిపాలెం, సంతమాగులూరు క్రాస్, రొంపిచర్ల క్రాస్, విప్పెర్ల, నెకరికల్లు మీదుగా దేవరంపాడు క్రాస్ కొండమోడు, పిడుగురాళ్ల బైపాస్ మీదుగా అయ్యప్పనగర్ బైపాస్ చేరుకుని, అక్కడ బహిరంగ సభలో ప్రసంగిస్తారని

పార్టీ తెలియచేసింది. సభ అనంతరం కొండమోడు జంక్షన్ అనుపాలెం, రాజుపాలెం, రెడ్డిగూడెం మీదుగా జగన్మోహన్ రెడ్డి ధూళిపాళ్ళకు చేరుకుంటారని వెల్లడించింది.

---------------------------

ఆంధ్ర ప్రదేశ్‌లో లోక్ సభ, అసెంబ్లీ ఎన్నికలకు కాంగ్రెస్ పార్టీ రెండవ జాబితా విడుదల చేసింది. ఇటీవల ఐదు లోక్ సభ , 114 అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించిన కాంగ్రెస్ అధిష్ఠానం.. తాజాగా ఆరు లోక్సభ, 12 అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేసింది. విశాఖపట్నం లోకసభ అభ్యర్థిగా పులుసు సత్యనారాయణ రెడ్డిని, అనకాపల్లి అభ్యర్థిగా వేగి వెంకటేశ్‌ను, ఏలూరు నుండి లావణ్య కావూరిని, నరసరావుపేట నుండి గార్నెపూడి అలెగ్జాండర్ సుధాకర్ ను, నెల్లూరు నుండి కొప్పుల రాజును, తిరుపతి అభ్యర్థిగా డా. చింతా మోహన్ పేర్లను ప్రకటిస్తూ ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి కే. సీ వేణుగోపాల్ జాబితాను విడుదల చేశారు. దీంతో రాష్ట్రంలో ఇప్పటివరకు మొత్తంగా 11 లోక్ సభ , 126 అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించినట్లయింది.

---------------------------

చంద్రుడిపై మరిన్ని ప్రయోగాలను చేపట్టేందుకు భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ –ISRO ప్రయత్నాలు చేస్తున్న క్రమంలో 'చంద్రయాన్-4' అభివృద్ధి దశలో ఉందని ఇస్రో ఛైర్మన్ ఎస్. సోమనాథ్ వెల్లడించారు. అంతరిక్ష పరిశోధన అనేది నిరంతర ప్రక్రియ అని.. ఇందులో మనదేశం గొప్ప పురోగతి సాధిస్తోందన్నారు. పంజాబ్ లుధియానాలో నిన్న ఒక పాఠశాలలలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ అంతరిక్ష పరిశోధతో పాటు వివిధ సాంకేతిక అభివృద్ధి ప్రాజెక్టుల్లో దేశవ్యాప్తంగా ఉన్న విద్యార్థులను భాగస్వామ్యం చేసేందుకు తమ సంస్థ చర్యలు చేపడుతోందని వెల్లడించారు.

---------------------------

సార్వత్రిక ఎన్నికలలో ఓటు వేసిన అభ్యర్థుల చేతి వేలికి సిరా ఉంటే ప్రవేశ పరీక్షలకు అనుమతించరని సామాజిక మాధ్యమాల వేదికగా జరుగుతోన్న ప్రచారం అవాస్తవమని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ –ఎన్‌టీఏ స్పష్టం చేసింది. ఆ ప్రచారం పూర్తి నిరాధారమనీ.. ఎన్టీఏ అలాంటి నిబంధనలు, మార్గదర్శకాలేవీ విడుదల చేయలేదని పేర్కొంది. సామాజిక మాధ్యమాలలో దీనికి సంబంధించి ప్రచారం అవుతున్న సందేశాలు పూర్తిగా నిరాధారమైనవనీ, ఇలాంటి వదంతులను పట్టించుకోవద్దని, తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని విద్యార్థులను కోరింది. అభ్యర్థులు తమ చదువుపై దృష్టి సారించాలని, రాబోయే పరీక్షలకు సిద్ధం కావాలనీ ఎన్‌టీఏ సూచించింది.

---------------------------

తెలంగాణాలోని భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామివారి దేవస్థానంలో ఉగాది సందర్భంగా శ్రీరామనవమి కల్యాణ బ్రహ్మోత్సవాలు నిన్న ప్రారంభం అయ్యాయి. ఈనెల 23వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు కొనసాగుతాయి. బ్రహ్మోత్సవాల కోసం అన్ని ఏర్పాట్లు చేసినట్లు అధికారులు తెలిపారు. 16వ తేదీన నిర్వహించే ఎదుర్కోలు వేడుకకు భారీస్థాయిలో భక్తులు తరలి రానున్న నేపథ్యంలో అవసరమైన సదుపాయాలను కల్పించేందుకు చర్యలు చేపట్టారు. 17వ తేదీన ప్రధాన ఉత్సవమైన శ్రీరామనవమి సందర్భంగా ఉదయం 10 గంటల 30 నిముషాల నుంచి మధ్యాహ్నం 12 గంటల 30 నిముషాల వరకు మిథిలా మండపంలో శ్రీసీతారామ కల్యాణోత్సవం నిర్వహించనున్నారు. 35 వేల మంది ప్రత్యక్షంగా వీక్షించేందుకు మండప ప్రాంగణాన్ని 24 సెక్టార్లుగా విభజించారు. సీతారామ కల్యాణోత్సవం వీక్షించేందుకు టికెట్లను ఆన్‌లైన్‌తో పాటు కౌంటర్లలో విక్రయిస్తున్నారు.

---------------------------

తెలంగాణాలోని సిద్ధిపేట జిల్లాలో ఎన్నికల నియమావళిని ఉల్లంఘించిన 106 మంది ప్రభుత్వ ఉద్యోగులను జిల్లా ఎన్నికల అధికారి సస్పెండ్ చేశారు. మెదక్ బీఆర్ఎస్ లోక్ సభ అభ్యర్థి వెంకట్రామిరెడ్డితో కలిసి సమావేశంలో

పాల్గొన్న 106 మంది ప్రభుత్వ ఉద్యోగులను సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీ అయ్యాయి .ప్రభుత్వ ఉద్యోగులు రాజకీయ సభలో పాల్గొనడంపై ఎన్నికల సంఘం, సిద్దిపేట పోలీసులకు ఫిర్యాదులు అందిన క్రమంలో వెంటనే చర్యలు తీసుకోవాలని ఎన్నికల సంఘం జిల్లా ఎన్నికల అధికారికి ఆదేశాలు జారీ చేసింది.

---------------------------

తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీ క్రోధినామ సంవత్సర ఉగాది ఆస్థానం నిన్న శాస్త్రోక్తంగా ఈరోజు జరిగింది. శ్రీదేవి భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామివారికి, విష్వక్సేనుల వారికి విశేష సమర్పణ చేశారు. విమాన ప్రాకారం, ధ్వజస్తంభం చుట్టూ ఊరేగింపు నిర్వహించారు. శ్రీవారి మూలవిరాట్టుకు, ఉత్సవమూర్తులకు నూతన వస్త్రాలను ధరింపచేశారు. అనంతరం పంచాగ శ్రవణం నిర్వహించారు. శ్రీశైలంలో భ్రమరాంబ మల్లికార్జున స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం పంచాంగశ్రవణం కార్యక్రమము నిర్వహించారు. చిత్తూరు జిల్లా కాణిపాకం వరసిద్ధి వినాయకుని ఆలయంలో ఉగాది సంబరాలు చేపట్టారు. ఆలయాన్ని వివిధ రకాల పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. అలాగే ఉదయం స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలను నిర్వహించారు. విజయనగరం జిల్లా మన్నార్ రాజగోపాలస్వామి ఆలయంలో శ్రీ క్రోధినామ సంవత్సర ఉగాది వేడుకలు సంప్రదాయబద్దంగా జరిగాయి.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో ఒంటి పూట బడులలో రోజూ కచ్చితంగా మూడు సార్లు వాటర్ బెల్ కొట్టాలని ఇటీవల ఆదేశించిన రాష్ట్ర ప్రభుత్వం.. మరో కీలక నిర్ణయం తీసుకుంది. వేసవి సెలవులు ముగిశాక పాఠశాలల పునః ప్రారంభం తర్వాత కూడా ఈ విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించింది. విద్యార్థుల్లో డీహైడ్రేషన్‌ను తప్పించేందుకు ప్రస్తుతం 45వేలకు పైగా ప్రభుత్వ పాఠశాలల్లో రోజూ ఉదయం 8 గంటల45 నిమిషాలకు 10గంటల5నిమిషాలకు, 11 గంటల 50 నిమిషాలకు వాటర్ బెల్ కొడుతున్నారు.

---------------------------

తెలంగాణలో రాగల ఐదు రోజుల పాటు ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి వర్షాలు కురిసే అవకాశముందని హైదరాబాద్‌లోని భారత వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఈ రోజు ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, వరంగల్, హన్మకొండ, సిద్దిపేట, కామారెడ్డి జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో పాటు 30 నుండి40కి.మీ వేగంతో ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది.ఈ జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది.

ఇలా ఉండగా... ఈరోజు ఆంధ్రప్రదేశ్ లోని 11 మండలాల్లో తీవ్ర వడగాలులు, 134 మండలాల్లో వడగాలులు వీచే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది. విజయనగరం జిల్లాలో 25, తూర్పు గోదావరి జిల్లా లో 19, శ్రీకాకుళంలో 17, అనకాపల్లిలో 16, మన్యంలో 11, అల్లూరి జిల్లాలో 10 మండలాల్లో వడగాలులు వీయవచ్చనీ, ఆయా ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలనీ సూచించింది.

---------------------------

నేషనల్ గ్రీన్ హైడ్రోజన్ మిషన్ కింద పరిశోధన అభివృద్ధి ప్రతిపాదనలకు సంబంధించిన సమర్పణ గడువును కేంద్ర ప్రభుత్వం ఏప్రిల్ 27 వ తేదీ వరకు పొడిగించింది. ఇంతకు ముందు సమర్పించడానికి చివరి తేదీ ఏప్రిల్ 12 కాగా... అభ్యర్థనల దృష్ట్యా గడువును పొడిగించినట్లు నూతన, పునరుత్పాదక ఇంధన మంత్రిత్వ శాఖ తెలిపింది.

=====================